క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



పాదయాత్ర చేస్తున్న కార్యకర్తలు

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని, చెంజర్ల నుంచి పచ్చునూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ ఆదివారం బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పాదయాత్ర నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పదేళ్లుగా గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. చెంజర్ల నుంచి గంగిపల్లి మీదుగా కొండపలకల, మద్దికుంట నుంచి పచ్చునూర్ వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మట్టిరోడ్డు గుంతల మయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, గ్రామాని రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో తిరుపతి, ప్రభాకర్, భానుచందర్, చశ్రీనివాస్, లక్ష్మయ్యగౌడ్, సయ్యద్ బావుజాన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన యువకుడిపై కేసు

కరీంనగర్‌క్రైం: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. కొత్తపల్లిలోని ఓ భూ వివాదం కేసులో ఇటీవల బీఆర్ఎస్ నాయకుడు నందెల్లి మహిపాల్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా అతడి గురించి బద్దిపల్లి గ్రామానికి చెందిన తాండ్ర సతీశ్ వాట్సాప్ గ్రూప్‌లో రెచ్చగొట్టే పలు పోస్టులు పెట్టాడు. సోషల్ మీడియా వేదికగా ఇతరులను రెచ్చగొట్టడంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించడంతో సతీశ్‌పై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత



అనాథ ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందిస్తున్న ట్యూరిటో సిబ్బంది


వీణవంక: వీణవంకకు చెందిన ట్యూరిటో, యుప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ట్యూరిటో సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా జమ్మికుంటలోని అనాథ ఆశ్రమంలో కేక్‌కట్ చేసి నిత్యావసర సరుకులు అందించారు. విజన్ 2020పేరుతో ఉదయానందన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, సమ్మిరెడ్డి, అమృత ప్రభాకర్, వెన్నంపల్లి నారాయణ, మంతెన శ్రీధర్, తాళ్లపల్లి కుమారస్వామి, హమీద్, ట్యూరిటో సిబ్బంది ఉన్నారు.

టీషర్టులు అందజేత



టీషర్టులు అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి

గన్నేరువరం: గన్నేరువరం క్రికెట్ క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బుర్ర తిరుపతిగౌడ్ ఆదివారం వేర్వేరుగా టీషర్టులను అందజేశారు. మండలకేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. క్రీడాకారులకు వివిధ పార్టీల నా యకులు టీషర్టులు, క్రికెట్ కిట్లు అందిస్తున్నారు.



టీషర్టులు అందిస్తున్న బుర్ర తిరుపతిగౌడ్

మేస్త్రీలు, కష్టమర్లకు అవగాహన సదస్సు

కరీంనగర్: అదానీ సంస్థ(ఏసీసీ, అంబుజా) ఆధ్వర్యంలో నగరంలో మేస్త్రీలు, కస్టమర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్మాణంలో సిమెంట్ ఎలా వాడాలి, సిమెంట్‌కు కంకర ఎంత మోతాదులో కలపాలి, స్లాబ్ క్యూరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నూతనంగా గృహాలు నిర్మించుకునేవారికి తాము సలహాలు ఇస్తున్నట్లు ఆర్‌పీఎస్ఎం ఏపీ, టీజీ టెక్నికల్ హెడ్ ఏడుకొండలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్లు కృష్ణప్రకాశ్, పెద్దపల్లి శివప్రసాద్, వెంకటనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో ఆదివారం వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగాధర శాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మత్స్య గిరీంద్రస్వామి చక్రస్నానం

మండలంలోని కొత్తగట్టు గుట్టపై కొలనులో స్వామివారికి వేద పండితులు వేదమంత్రాల సాక్షిగా ఆదివారం చక్రస్నానం కన్నుల పండువగా జరిపించారు. తెల్లవారు జామున సుప్రభాతం, నిత్యారాధన, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పుష్పయాగ కార్యక్రమం కల్యాణ మండపంలో జరిపించారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వాములవారికి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్‌లో ఓ భక్తురాలు సొమ్మసిల్లి పడిపోగ వైద్యసిబ్బంది స్పందించి తక్షణమే వైద్యం అందించారు. ఈకార్యక్రమంలో యజ్ఞాచార్యులు శేషం, రామకృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, మాధవాచార్యులు, చైర్మన్ మల్లారెడ్డి, ధర్మకర్తలు మల్లారెడ్డి, ప్రభాకర్, కుమారస్వామి, కవిత, ఐలయ్య, నీలమ్మ, ఈఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో...

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో షోడశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదా సమేతలకు ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఘనంగా చక్రస్నానం నిర్వహించారు. ఉదయం మహాపూర్ణాహుతి, స్వామివారికి అభిషేకం, మంగళ శాసనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ధ్వజారోహనం, కుంభప్రోక్షణ, ద్వాదశారధాన, శ్రీపుష్ప యాగం, సప్తవర్ణాలు, ఏకాంతసేవ, యాజమాన్య ఆశీర్వచనం, ఆచార్య సన్మానం కార్యక్రమంలో నిర్వహణతో షోడశ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు డింగరి కృష్ణామాచార్యులు, వేణుగోపాలచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ముక్క జితేంద్రగుప్తా, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ సత్యలక్ష్మిమాత ఆలయ వార్షిక మహోత్సవం

గన్నేరువరం: మండలకేంద్రం గన్నేరువరంలో శ్రీ సత్యలక్ష్మిమాత వార్షిక మహోత్సవం కార్యక్రమం యాదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తికి ఫలపంచామృతాలతో విశేష అభిషేకం, నీరాజనం, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు శ్రీసత్యలక్ష్మిమాతా ఆలయం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు నిర్వహించారు. మహిళల కోలాటం, భక్తి పాటల కార్యక్రమాన్ని చేపట్టగా ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి లింగన్న, కోశాధికారి శంకర్, పురోహితులు మణిశంకరశర్మ, ఆలయ పూజారులు రాహుల్ మిశ్రా, రాకేశ్‌శర్మ పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

శంకరపట్నం: మండలంలో జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర హుండీ ఆదాయాన్ని సోమవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో లెక్కించనున్నామని జాతర కమిటీ చైర్మన్ గుర్రం స్వామి తెలిపారు. అమ్మవార్ల హుండీలను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచామని చెప్పారు.



శంకరపట్నం: స్వామివారికి చక్రస్నానం జరిపిస్తున్న పురోహితులు



విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తులు



శ్రీవేంకటేశ్వరస్వామికి చక్రస్నానం



గన్నేరువరం: ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హుజూరాబాద్‌రూరల్: మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే పోటీ నిర్వాహకులు



వీణవంక: విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా తైక్వాండో అసోసియేషన్ నిర్వాహకులు

హుజూరాబాద్‌రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఆదివారం తెలిపారు. కట్టాస్ పోటీల్లో షాదుల్లాబాబా, లతీఫ్ బాబా అనే గోల్డ్ మెడల్స్ సాధించారని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రిటైర్డు ఎంఈవో గొట్టె జమదగ్ని, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఖలీద్ హుస్సేన్, నాయకులు ఉప్పు శ్రీనివాస్ పటేల్, ఆలీం, ఇప్పలపల్లి చంద్రశేఖర్, రావుల రాజేశ్ అభినందించారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

వీణవంక: హైదరాబాద్‌లోని రామచంద్రాపురం టెంపులాఫ్‌గ్రౌండ్‌లో ఈ నెల 18న తెలంగాణ తైక్వాండో అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. కరీంనగర్ నుంచి మొదటి స్థానం సాధించి, పుదుచ్చెరిలో ఈ నెల 27నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే పోటీలకు జోన్ స్థాయికి విద్యార్థులు అక్షిత, చందన, అమూల్య, ఎండీ అస్మిన్ ఎంపికయ్యారు. కరీంనగర్ జిల్లా ఒలింపిక్ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తైక్వాండో జిల్లా అధ్యక్షుడు దాసరి అంజయ్య, ప్రధాన కార్యదర్శి బాపు సంపత్‌యాదవ్, కోచ్‌లు ఎడ్ల రవీందర్‌రెడ్డి, అపరాధ శ్రీధర్, గెజిటెడ్ అధికారులు రాపెల్లి శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, పీఈటీ హరికిషన్ ఆదివారం విద్యార్థులను అభినందించారు.



రామడుగు:నవనీతను అభినందిస్తున్న శేఖర్‌రావు

జాతీయ స్థాయికి విద్యార్థిని ఎంపిక

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి పాఠశాల విద్యార్థి రాచమల్ల నవనీత అబాకస్‌లో నేషనల్ లెవల్‌కు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచిందన్నారు. నవనీతను ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఆదివారం అభినందించి చాంపియన్‌షిప్ ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్స్ కె. శిరీషా, స్రవంతి, పలువురు పాల్గొన్నారు.

పుష్పయాగంలో ఎంపీ బండి సంజయ్



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ బండి సంజయ్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్య గిరీంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమాక్ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎంపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ పుష్పయాగంలో పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలి



విగ్రహ ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న పంజాల జైహింద్‌గౌడ్

హుజూరాబాద్‌రూరల్: భావితరాలకు సర్వాయి పాపన్న చరిత్ర తెలియాలంటే ప్రభుత్వాలు ఆయన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్ అన్నారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పరిటాల రవి సర్వాయి పాపన్న విగ్రహాన్ని అందజేయగా ఆదివారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆవిష్కరణ సభలో మాట్లాడారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బహుజన రాజ్యం రావాల్సిన అవసరం ఉందని, మహనీయుడు పాపన్న చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చటంపై ప్రభుత్వం ఆలోచన చేయాలని, గ్రామగ్రామాన సర్వాయి పాపన్న విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయనను గీత కార్మిక సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాటూరి శ్రీనివాస్‌గౌడ్, కొండ మల్లేశంగౌడ్, కలర్ సత్యం, దశరథం, ఐలయ్య, సత్యం, శ్రీనివాస్ ఉన్నారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

జమ్మికుంట: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విలాసాగర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ యాజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఇసుక రవాణా చేస్తే ఊరుకోబోమని, ఎవరికీ మినహాయింపు లేదని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని అన్నారు. ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, గతంలో కేసులు నమోదై ఉన్నవారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక కావాల్సినవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మీ సేవలో డబ్బులు చెల్లించి, ఇసుక రీచ్‌ల నుంచి తెప్పించుకోవాలని, ఇసుక అక్రమ రవాణాలను ప్రోత్సహించవద్దని మండల ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాధాకిషన్,ట్రాక్టర్ యాజమానులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ రవి

కూలీలకు వసతులు కల్పించండి

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏర్పడిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిందని, ఇటీవల ఏర్పడిన ప్రభుత్వం కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు. మండుటెండల్లో పనులు చేసి అలసిన కూలీలు సేద తీరడానికి అవసరమైనన్ని టెంట్లు వేయాల్సి ఉన్నా.. కొన్నేళ్ల నుంచి వీటిని సమకూర్చకపోవడంతో ఎండలోనే భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. చేస్తున్న పనులతో కూలీలకు ఉపాధి లభిస్తున్నా.. వారికి కనీస వసతులు కల్పించకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పనులు చేసే సమయంలో కూలీలకు ఏదైనా చిన్న దెబ్బ తగిలితే అక్కడే వారికి ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. ప్రస్తుతం ఇవెక్కడా కనిపించడం లేదనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రభుత్వమే గడ్డపార, పార, గుట్ల(తట్ట) పంపిణీ చేయాలి కానీ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఇవన్నీ ఉచితంగా ఇచ్చారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాలు కలుపుకొని మండలంలో 23 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలవుతుండగా, 3,800 ఆక్టివ్ ఉపాధి హామీ కార్డులు ఉండగా, సుమారు 1020 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఎంపిక చేసిన పనులను ప్రభుత్వం నిర్దేశించిన విధానంలో పనిచేస్తే ఒక్కరోజు రూ. 272లను చెల్లించాల్సి ఉండగా, పని జరిగే ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి నీళ్లు వస్తే జరగాల్సిన నిర్దేశిత విధానంలో పని జరగకపోతే కేవలం రూ. 242ల కూలీ మాత్రమే కూలీలకు దక్కుతుంది. ఉపాధి హామీ పనుల కాకుండా ఇతర వ్యవసాయ పనులకు వెళ్తే రోజుకు రూ. 300లకు పైగానే కూలీ వస్తుందని కూలీలు పేర్కొంటున్నారు.



వెంకట్రావ్‌పల్లె చెరువులో పూడికతీత పనుల్లో ఉపాధి హామీ కూలీలు

టార్పాలిన్లు, ఇతర అవసరాలు సమకూర్చాలి

మండుతున్న ఎండలో పనులు చేసిన కూలీలు విశ్రాంతి తీసుకోవడానికి ఐదేళ్ల కిందట టార్పాలిన్లు ఇచ్చారు. కమిషనర్ రూరల్ డెవలప్‌మెంట్(సీఆర్‌డీ) ద్వారా వీటిని సరఫరా చేశారు. ఆ సమయంలో ఇచ్చిన టార్పాలిన్లు భద్రంగా ఉంచాలని ఉపాధి హామీ మేట్‌లకు బాధ్యత అప్పజెప్పారు. పనుల వద్ద కూలీలు నీడన ఉండటానికి ఈ టార్పాలిన్లు వేయాల్సిన బాధ్యత కూడా వారిదే. కానీ చాలా ప్రాంతాల్లో నీడ కోసం ఈ టార్పాలిన్లు ఏర్పాటు కానరావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇంక ఎండలు మరింత ముదరక ముందే టార్పాలిన్లు వేసి నీడ సౌకర్యం కల్పించేలా చూడాలని కూలీలు కోరుతున్నారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు తాగునీటిని, ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సంబంధించిన సామగ్రిని సమకూర్చాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

ఉపాధి హామీలోని పనులు

మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారులను సరిచేయటం, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే సాగు నీటి కాలువలలో ఉన్న మట్టిని తీయటం, కొన్ని గ్రామాల్లో చెరువుల పూడికతీత పనులు, వరద మళ్లింపు, నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర పనులు జరుగుతున్నాయి.

కూలీ పెంచాలి...



మా గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనికి ఉదయం పోతే సాయంత్రం వరకు పని చేస్తున్నా. కూలీ పైసలు తక్కువ ఇస్తున్నారు. శ్రమకు తగ్గ కూలీ రావడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీని పెంచి ప్రభుత్వాలు మమ్మల్నీ ఆదుకోవాలి.

– ఎరుకొండ వనిత, ఉపాధి హామీ కూలీ, కాట్రపల్లి

సదుపాయాలు కల్పించేలా కృషి



ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా ఆయా స్థానిక గ్రామపంచాయతీల ద్వారా కనీస సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఉపాధి హామీ పనులు జరిగే చోట టార్పాలిన్లు వేసి నీడ కల్పించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– బి.చంద్రశేఖర్,ఏపీవో, హుజూరాబాద్

ఆర్థిక సాయం అందజేత



నగదు అందిస్తున్న పీఎంకే నిర్వాహకులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన ఎండీ ముస్తాఫా అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం పీఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్‌గౌడ్, నిర్వాహకులు మృతుడి కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవిగౌడ్, గండి రంజిత్‌కుమార్ గౌడ్, గిరవేన రాజయ్యయాదవ్, తాటిగంటి వీరాస్వామి, మొగిలిపాక లక్ష్మణ్‌గౌడ్, గండి యాద గిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట: బ్లూకోల్ట్స్ పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి ఆదివారం తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కొలిపాక శ్రీనివాస్, అతని డ్రైవర్ గరిగంటి రవివర్మ ఇద్దరు ఇసుక ట్రాక్టర్‌తో కనబడగా వాహనాన్ని ఆపి పత్రాలు చెక్ చేస్తుండగా ఇద్దరు పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి చేతులతో నెట్టేసి, పోలీస్ వాహనం తాళం చెవి లాక్కొని, అడ్డగించి ట్రాక్టర్‌తో పారిపోయారు. పోలీస్ సిబ్బంది ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


ప్రశ్నించే గొంతుకలపై దాడులు సరికావు

హుజూరాబాద్‌రూరల్: ప్రజాస్వామ్య దేశంలో ప్రజల గొంతుకగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే జర్నలిస్టులపై దాడులు జరగటం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి తెలియజేసే పవిత్రమైన వృత్తిలో కొనసాగే జర్నలిస్టులపై దాడులు జరిపితే.. మన గొంతులను మనమే నొక్కినట్లు అవుతుందని పేర్కొన్నారు.

అక్రమ లేఅవుట్ ప్లాట్లు తొలగింపు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో అక్రమ లేఅవుట్ ప్లాట్‌లను గ్రామ కార్యదర్శి శ్రీవిద్య ఆదివారం తొలగించారు. 324/ఏ1 సర్వే నెంబర్‌లో అక్రమంగా ప్లాట్లు పెట్టి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సంబంధిత అధికారులతో కలిసి గ్రామ కార్యదర్శి లే అవుట్ ప్లాట్ల హద్దురాళ్లను తొలగించారు. ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకుంటే అనుమతులు ఇవ్వటం జరగదని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గన్నేరువరం: మండలకేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్ 2008-09 ఏడో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరనం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. స్కూల్ కరస్పాండెంట్ భాను చైతన్య, ఉపసర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఉన్నారు.